

విద్యార్థులతో నిండిపోయిన 4వ తరగతి గది



ప్రాంగణంలో ఆడుకుంటున్న విద్యార్థులు

ప్రైవేట్‌కు దీటుగా అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల

- గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య
- ప్రస్తుతం 1 నుంచి 5 వరకు 238 మంది

బడి మెరిసె.. విద్యార్థులు మురిసె

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాల సకల సౌకర్యాలతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలబడింది. ప్రైవేట్ పాఠశాలలు ఎలా ఉంటాయో ఈ ప్రభుత్వ పాఠశాల అదేవిధంగా కనిపిస్తోంది. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు సంతోషపడుతున్నారు. గత సంవత్సరానికి పోలిస్తే ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కళకళలాడుతోంది.

జిల్లాలోనే ఆదర్శం..

మండల పరిధిలోని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధిలో భాగంగా 30.28 లక్షలు వెచ్చించి పాఠశాలను అన్ని విధాలుగా ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించడంతో ఈ పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా ఆదర్శనీయంగా ఏర్పడింది. ముఖ్యంగా పాఠశాల గేటుతో పాటు బోర్డు ఏర్పాటు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి కార్యాలయానికి కొత్త రంగులు, పాఠశాలలోని అన్ని గదులకు రంగులతో పాటు వివిధ ఆదర్శమైన బొమ్మలు వేయడంతో విద్యార్థులు మురిసిపోతున్నారు. విద్యార్థులు కూర్చునేందుకు రంగు రంగుల బెంచీలు, బ్లాక్ బోర్డులు, కావాల్సిన సదుపాయాలు కల్పించారు. అదేవిధంగా ఈ పాఠశాలకు విద్యుత్ సరఫరా కోసం సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసి విద్యుత్ అందిస్తున్నారు. దీంతో అజీజ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలిచింది. పాఠశాలలో విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడా సామగ్రి ఏర్పాటు చేయడంతో పాటు అమెరికా టైపు టాయిలెట్స్, వాష్‌రూమ్స్, హ్యాండ్ వాష్ నల్లాలు, ఫిల్టర్ తాగునీరు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు పాఠశాలకు సమయానికి లోపలికి రాగానే ఉపాధ్యాయులు గేటును మూసివేస్తున్నారు. మధ్యాహ్నం భోజనం టైమ్, విరామం టైమ్‌లో పిల్లలను వదతుతామని పేర్కొంటున్నారు. విద్యార్థులకు అన్ని వసతులు ఉండడంతో ఎక్కడికి వెళ్లడం లేదు. ఉదయం వచ్చారంటే సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉంటున్నారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య..

మండల పరిధిలోని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి వరకు 238 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో 1వ తరగతిలో 45 మంది, 2వ తరగతిలో 37 మంది, 3వ తరగతిలో 32 మంది, 4వ తరగతిలో 67 మంది, 5వ తరగతిలో 55 మంది విద్యార్థుల సంఖ్య గత సంవత్సరానికి పోలిస్తే ఈ సంవత్సరం పెరిగిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కొత్తగా ఈ సంవత్సరం బడి బాట కార్యక్రమంలో భాగంగా 84 మంది విద్యార్థులు చేరారని అందులో 1వ తరగతిలో 45 మంది కాగా మిగతా ఇతర క్లాసుల్లో చేర్పించారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

చదువుపై ఆసక్తి పెంచేందుకే..



నిరుపేద కుటుంబాల్లో పుట్టి పెరిగిన పిల్లలు ఉన్నత చదువులకు వెళ్తున్నారు. అందుకు ప్రభుత్వం విద్యాపరంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తోంది. అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిన మాట నిజమే. పాఠశాల అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం విద్యార్థులకు ఆ పాఠశాలకు గర్వకారణం. అందుకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం.

– ఎం.వెంకటయ్య, మండల విద్యాధికారి

ఆటలతో పిల్లల్లో మార్పు..



పిల్లలు చదువుకోవాలంటే వారి మానసిక స్థితి బాగుండాలి. ఆటలతో వారిలో మార్పు వస్తుంది. శారీరక దృఢత్వం పెంపొందుతుంది. అందుకే పిల్లలకు విద్యతో పాటు ఆటల్లో రాణిస్తున్నాం. పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రీడా వస్తువులు విద్యార్థులకు ఎంతో సంతోషాన్నిస్తున్నాయి. ఇంటర్వెల్, ఖాళీ సమయంలో విద్యార్థులు ఆడుకుంటూ సంబరపడుతుంటారు. విద్యార్థుల అభివృద్ధి కోసం అమ్మబడిలో భాగంగా మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి పాఠశాల చైర్మన్‌ను ఏర్పాటు చేసుకున్నాం. విద్యార్థుల అభివృద్ధి కోసం అందరం కృషి చేస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం ఈ పాఠశాలలో 84 మంది విద్యార్థులు రావడం అదృష్టం.

– అరుణ్‌కుమార్, హెచ్‌ఎం, అజీజ్‌నగర్

క్లుప్తంగా

తపాలా సేవలను ఆదరించాలి

డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

కొత్తూరు: ప్రజలు, వ్యాపారులు తపాలా శాఖ అందిస్తున్న సేవలను ఆదరించాలని షాద్‌నగర్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కోరారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా తపాలాశాఖ అందిస్తున్న పథకాలు, సేవల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా పోస్టాఫీస్ ఖాతాలైన సేవింగ్ బ్యాంక్, సుకన్య సంవృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్, ఫిక్స్‌డ్ డిపాజిట్, ఐపీపీబీ ఖాతాలు, ఇన్సూరెన్స్ సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీపీఎం రాములు, అస్లాం, బీపీఎం వినోద్, అసియాబేగం, ఈఓ పీకేఆర్ వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



ఉపాధ్యాయులకు టీవీ అందజేస్తున్న కృష్ణ కుటుంబ సభ్యులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కృష్ణ ఆరునెలల క్రితం షాద్‌నగర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగా బుధవారం ఆయన జయంతి సందర్భంగా అతని భార్యాపిల్లలు, ఉపాధ్యాయులు పాఠశాలలో కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలకు టీవీ, విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ



విద్యార్థులకు షూ అందజేస్తున్న మహేందర్

కొత్తూరు: మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఈశ్వర మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎమ్మె మహేందర్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో పాఠశాలల్లో మరిన్నీ సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు కూడా తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. భవిష్యత్‌లో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



హరికృష్ణకు నియామకపత్రం అందిస్తున్న నాయకులు

కేశంపేట: ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా కేశంపేట గ్రామానికి చెందిన ఉడుత హరికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య సమక్షంలో హరికృష్ణకు బుధవారం నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ అందిస్తున్న పథకాలను ఇంటింటికీ తీసుకెళ్తానన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోండి



సురేందర్‌రెడ్డి

శంకర్‌పల్లి: మండలంలోని కొండకల్ గ్రామంలో 18 నుంచి 65ఏళ్ల లోపు వయస్సు వారికి ఏడాది పాటు ఒక్కొక్కరికీ రూ.5లక్షల ఉచిత ప్రమాద బీమా పాలసీ చేయించేందుకు ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి ముందుకొచ్చారు. ఆసక్తి గలవారు బుధవారం నుంచి ఈ నెల 18 వరకు తమ ఆధార్, పాన్ కార్డులను తీసుకొని కొండకల్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావాలని పిలుపునిచ్చారు. గ్రామ సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు ఆయన తెలిపారు.

యజ్ఞయాగాలతో వాతావరణ సమతుల్యత



యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, నిర్వాహకులు, విద్యార్థులు

కొందుర్గు: యజ్ఞయాగాలతో వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని పండిత వసుధా శాస్త్రీ అన్నారు. చౌదరిగూడ ఆర్య సమాజంలో మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రావణ యజుర్వేద పారాయణ మహాయజ్ఞం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను పూర్ణాహుతితో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వసుధాశాస్త్రీ మాట్లాడుతూ.. పూర్వకాలంలో రాజులు యజ్ఞయాగాలు చేయడంతోనే వర్షాలు సంవృద్ధిగా కురిసేవని గుర్తు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు భూపాలచారి, అందె బాబయ్య, ఆర్య సమాజం ప్రతినిధి హరికిషన్ వేదాలంకర్, శివకుమార్, బండారు రమేశ్, మచ్చ సుధాకర్ రావు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, రఘునందన్, బాలబ్రహ్మచారి, కుమార్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: విదేశీ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, మంత్రి శ్రీధర్‌బాబులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కలిశారు. బుధవారం నగరంలో సీఎంను కలిసి విదేశీ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి వచ్చినందుకు పలువురు ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లిన ఆయన సీఎంకు స్వాగతం తెలిపారు.

సీఎం, మంత్రికి స్వాగతం పలికిన నాయకులు

మొయినాబాద్: విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు నేతలు ఘనస్వాగతం పలికారు. బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబును గౌడ సంఘం నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ల శ్రీశైలంగౌడ్, ప్రధాన కార్యదర్శి చేగూరి రామకృష్ణగౌడ్, నాయకులు విజయ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దేవాదాయశాఖ మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి కొండా సురేఖతో నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బుధవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట అంబా భవానీమాత దేవాలయ ధర్మకర్తల మండలి పాలక వర్గం నూతన కమిటీ ఏర్పాటుపై చర్చించినట్లు బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు. దేవాలయ నూతన కమిటీని త్వరలోనే పూర్తిచేయాలని మంత్రి సూచించినట్లు వివరించారు. దేవాలయ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. నూతన పాలక మండలి కమిటీతో పాటుగా గ్రామస్తులు దేవాలయ అభివృద్ధిలో భాగస్వాములు కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఎంపీటీసీల సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి శ్రీశైలం, నాయకులు రాజు, నరేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం



దాత సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో గల వేణుగోపాలస్వామి దేవాలయ అభివృద్ధికి సహకరించేందుకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన దాత సుబ్బారెడ్డి ముందుకొచ్చారు. అతిపురాతనమైన వేణుగోపాలస్వామి దేవాలయానికి రూ.10లక్షలతో ప్రహరీ నిర్మాణాన్ని చేపడతానని హామీనిచ్చారు. దీంతో గ్రామస్తుల సమక్షంలో ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. పురాతన దేవాలయాలు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తాయని గ్రామస్తులు పేర్కొన్నారు. అనంతరం దాత సుబ్బారెడ్డిని గ్రామస్తులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులతో శాశ్వత పరిష్కారం

కొందుర్గు: ఆయుర్వేద మందులతో రోగులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని డాక్టర్ శీల అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బుధవారం వయోవృద్ధులకు ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 95 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతిరోజు సరైన వ్యాయామం చేస్తూ ఆయుర్వేద మందులు క్రమం తప్పకుండా వాడితే రోగాలు నయమవుతాయని సూచించారు. మధుమేహం, రక్త పోటు తదితర దీర్ఘకాలిక రోగాలకు చక్కటి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షర్మిళ, సిబ్బంది బాబు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొందుర్గు: ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం కొందుర్గు ఎంపీఓ లాలయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే కూలీలకు 10 వారాలుగా డబ్బులు రాకపోతే ఎలాగని ప్రశ్నించారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన అనంతరం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఈ పథకానికి రూ. 2.63 లక్షల కోట్లు అవసరం ఉంటే కేవలం 79వేల కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించడం దారుణమన్నారు. కూలీల పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, చంద్రయ్య, సురేశ్, వెంకటయ్య, కిష్టయ్య, రేణమ్మ, రాజు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని స్థానికుల ధర్నా



పరిశ్రమ గేటు ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు

కొత్తూరు: స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ నందిగామ మండలంలోని బండకుంటతండా సమీపంలో ఉన్న ఎంఎస్ఎన్ ల్యాబోరేటరీస్ పరిశ్రమ ఎదుట బుధవారం స్థానికులు ధర్నా చేపట్టారు. వారికి స్థానిక ప్రజాప్రతినిధులు మద్దతు తెలిపారు. అనంతరం ధర్నా చేస్తున్న వారితో ప్రజాప్రతినిధులు చర్చించి పరిశ్రమ ప్రతినిధులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. దీంతో వారు డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పడంతో స్థానికులు ధర్నా విరమించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధి కల్పన అంశంలో పరిశ్రమ నిర్వాహకులు స్థానికులకు సహకరించడం లేదన్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న స్థానికులకు వారంలో నాలుగురోజులు మాత్రమే పని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం స్పందించి ఉపాధి అంశంలో స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇప్పటికే పనిచేస్తూ అన్ని అర్హతలు ఉన్న స్థానిక కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. అంతేకాకుండా పరిశ్రమలో పలు విభాగాల్లో ఉన్న కాంట్రాక్టుల్లో కొన్ని స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సామాజిక సేవలో భాగంగా పరిశ్రమ నిర్వాహకులు బండకుంట తండాకు బస్ సౌకర్యం కల్పించి విద్యార్థులకు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, కొమ్ముకృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న డా.ప్రతాప్‌రెడ్డి

శంకర్‌పల్లి: ప్రతీ విద్యార్థికి తమ హక్కులపై అవగాహన అవసరమని హైదరాబాద్ ఇక్ఫాయ్ లా స్కూల్ డీన్ డా.ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు లీగల్ విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు 'మీ హక్కులను తెలుసుకోండి' అనే అంశంపై క్విజ్, కవిత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని, మళ్లీ ఈ పాఠశాలను సందర్శించనున్నట్లు వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఇక్ఫాయ్ లీగల్ ఎయిడెడ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనాపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణ బదిలీ కావడంతో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గ్రామస్తులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధికి కృష్ణ ఎంతో కృషి చేశాడని గుర్తుచేశారు. ఆయన సేవలు ఎప్పుడు మరిచిపోలేనివన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు, గ్రామస్తులు నర్సింలు, జగన్‌మోహన్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్
- ఫోన్ ఇన్ ఫిర్యాదులపై కమిషనర్ దృష్టి



డంపింగ్ యార్డు వద్ద చెత్త తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: దశలవారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో కమిషనర్‌కు ప్రాంత ప్రజలు పలు సమస్యలను విన్నవించిన విషయం విధితమే. అనంతరం సమస్యల పరిష్కారానికి ఆయన దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం మున్సిపాలిటీలోని 1,9వ వార్డుల్లో వీధికుక్కలను బ్లూ క్రాస్ వారికి పట్టించారు. అనంతరం డంపింగ్ యార్డు వద్ద చెత్తను రోడ్డుపై వేయడంతో ఇబ్బందులు తలెత్తినట్లు ఫిర్యాదు రాగా.. జేసీబీ సాయంతో చెత్తను డంపింగ్ యార్డు లోపలికి తరలించారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి ఆనంద్, సిబ్బంది అమర్‌నాథ్, హరిదాసు తదితరులు ఉన్నారు.

హిందువులపై దాడులు సరికాదు

- బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన
- మండల కేంద్రంలో చేపట్టిన బంద్, ర్యాలీ విజయవంతం



ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీలు, హిందూ సంఘాల నాయకులు

చేవెళ్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని కోరుతూ చేవెళ్లలో హిందూ సంఘాలు ఇచ్చిన బంద్, ర్యాలీ విజయవంతమైంది. చేవెళ్లలో బుధవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దల్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వ్యాపారులు బంద్ పాటించి ర్యాలీ నిర్వహించారు. పార్టీలకతీతంగా అన్ని నాయకులు, ప్రజలు పాల్గొని హిందువుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ లెక్చరర్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులపై హిందూ సమాజం ఏకంకావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసలు జరుగుతున్నాయని వాటిని తీవ్రంగా ఖండించాలన్నారు. ఇలాగే హిందువులు వదిలేస్తే నేడు బంగ్లాదేశ్‌లో జరిగినట్లుగానే మనదేశంలో కూడా జరుగుతాయన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరగకుండా ఉండాలని బంగ్లాదేశ్ సంఘటనకు నిరసనగా ఈ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ఈ ర్యాలీ, బంద్‌కు స్వచ్ఛందంగా ప్రజలు సహకరించి దుకాణాలు బంద్ చేసి ర్యాలీలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో మండలంలోని హిందూ సంఘాలు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దల్ నాయకులు, ఏబీవీపీ కార్యకర్తలు, కళాశాలల విద్యార్థులు పలు పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.